


భారత్

# ప్రతినిధి

తెలుగు దిన పత్రిక






సంపుటి: 3 సంచిక: 293 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు ఆదివారం, 16 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 293 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SUNDAY, 16 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

**- స్వర్ణాంధ్ర ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం**

- అమరావతిలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు
- మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించిన సీఎం
- ప్రతిభ కనపర్చిన పోలీసులకు పతకాలు అందించిన ముఖ్యమంత్రి

**అమరావతి, ఆగస్టు 15:** ఆంధ్రప్రదేశ్‌ను వికాసం నుంచి వైభవం వైపు నడిపిస్తున్నామని.. సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2047 స్వర్ణాంధ్ర సాధన సంకల్పం 5.5 కోట్ల మంది ఆంధ్రులు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి జాతీయత, దేశభక్తితో కూడిన స్ఫూర్తి దాయకమైన ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి

మిగతా2లో...



## దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

● ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం ● ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం ● సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యు ఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమై న పునాదిగా మోడీ అభివర్ణించారు.

మిగతా2లో...

## భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

- అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాలూ కలిసి పని చేస్తున్నాయి
- అంతర్జాతీయ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం కృషి
- అంతర్జాతీయ స్వాతంత్ర్య వేడుకల వేళ రష్యా అధ్యక్షుడి ప్రశంసలు
- అంతర్జాతీయ ద్రౌపదీ ముర్ము, మోడీలకు పుతిన్ శుభాకాంక్షలు


2లో

## రాజమహేంద్రవరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు

- రాష్ట్రవ్యాప్తంగా క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్
- ఆరు ప్రధాన క్లస్టర్ల పరిధిలో వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి
- 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు తీరనున్న ముడి సరుకు సమస్య


2లో

## కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

- అసెంబ్లీలో చర్చిద్దాం రండీ..రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవం
- జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు : ముఖ్యమంత్రి
- సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



**మెదక్, ఆగస్టు 15:** "తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నిస్తున్నాయి. ఆ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మ బొరుసులాంటివి. గత ప్రభుత్వంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్.. తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి సాగు చేశాడు. తాము రైతులకు మేలు చేస్తుంటే ఫామ్‌హౌస్‌లో పడుకుని మాపై విమర్శలు చేస్తున్నాడు. సంగారెడ్డి గడ్డ నుంచి సవాల్ చేస్తున్నా.. రైతులకు తాము చేసిన మేలేంటో... మీరు చేసిన అన్యాయం ఏంటో చర్చించేందుకు అసెంబ్లీకి రండీ" అని ముఖ్యమంత్రి

మిగతా2లో...

## చట్టబద్ధమైన పాలన, పారదర్శక న్యాయమే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:చీఫ్ జస్టిస్ లీసా గిల్ పిలుపు




**అమరావతి, ఆగస్టు 15:**రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రాంగణంలో భారత దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘణంగా జరిగాయి.హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాలు,ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతం త్ర్యం సిద్ధించిందని గుర్తుచేశారు. అమరవీరుల

మిగతా2లో...


2లో

## చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు

- కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ
- ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం
- అన్నిరంగాల్లో ఎపిని ముందువరసలో నిలబెట్టే ప్రయత్నం
- విజయవాడలో జెండా ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

## ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనాలకు నిధుల విడుదల

- రూ.22.50 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం
- - ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్


2లో

## చరిత్ర తెలుసుకుంటేనే ... భవిష్యత్ నిర్మాణం

**- టీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత**



**హైదరాబాద్ ఆగస్టు 15:** చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన

మిగతా2లో...

# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మనకు స్వాతంత్ర్యం అంత తేలికగా ఒక్కరోజులో ఒక్కరి పోరాటంతో రాలేదు. దశాబ్దాల పోరాటం ఎందరో మహనీయుల బలిదానం, మరెందరో అమరవీరుల ప్రాణత్యాగం మనకు స్వాతంత్ర్యాన్ని అందించాయి. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు చూసిన స్వప్నాన్ని సాకారం చేద్దాం. 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని నెంబర్ 1 చేద్దామన్న లక్ష్యంతో పనిచేద్దాం. హక్కుల్ని, గౌరవాన్ని ఇచ్చిన దేశానికి మనమేం చేయాలన్న ఆలోచనతో పనిచేద్దాం. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వచ్చే 20 ఏళ్లు అనునిత్యం పనిచేస్తామని సంకల్పం తీసుకోవాలి. ఈ దేశానికి మనం ఏం ఇవ్వగలం అని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. మనం ఏ పనిచేసినా దేశ భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని, సమాజహితం కోసం పనిచేయాలి. విద్యార్థి ఆవిష్కరణలతో రైతులు ప్రకృతి సాగుతో, ఉద్యోగి అంకిత భావనతో, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి. వ్యక్తిగత విజయాలన్నీ దేశ నిర్మాణంలో భాగం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్ లక్ష్యం, మనం రూపొందించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఏపీ దేశానికి బలమైన రాష్ట్రంగా ఎదగాలి. అంతా కలిసి ఐక్యంగా స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిద్దాం. దీనికి దృఢమైన సంకల్పం చేద్దాం". అని ముఖ్యమంత్రి అన్నారు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. దీంతో 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచింది. రెండేళ్లలో ఎఫ్‌డిఐ ఆరున్నర రెట్లు పెరిగింది. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమోనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి..95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టాం. సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం. నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చాం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సీఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ 20 వేలు అందిస్తున్నాం. పొగాకు, కోకూ, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నాం. "అని సీఎం వివరించారు. మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వయం బ్రాండ్ పేరిట వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏపీలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నాం. రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బీచ్ టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చాం. వారసత్వంగా వచ్చిన ఆస్తులు, భూమిపై హక్కులు కాపాడేలా రెవెన్యూలో సంస్కరణలు తెచ్చాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించాం. రాష్ట్రంలో ఆధ్యాత్మికతను పెంచేందుకు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల పవిత్రతను కాపాడేలా చర్యలు చేపట్టాం. ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాం.

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6జి సాంకేతికతను దేశంలోని మూలమూలలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, లాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# రాజమహేంద్రవరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు

**రాజమహేంద్రవరం, ఆగస్టు 15:** మన సాంస్కృతిక, వారసత్వ సంపద అయిన హస్తకళల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని ధవళేశ్వరం వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును శాసన మండలి సభ్యులు, స్థానిక శాసన సభ్యులు, అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు ప్రధాన క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు.ఈ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు రాష్ట్రవ్యాప్తంగా 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు ప్రధాన ముడిసరుకు అయిన కలప కొరత సమస్య నుంచి విముక్తి కలిగించనున్నాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలపను కళాకారుల కోసం అందుబాటులో ఉంచారు. వచ్చే ఐదేళ్లకు సరిపడా కలపను త్వరలో అందుబాటులో ఉంచుతామని అటవీ శాఖ అధికారులు తెలియజేశారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, మాధవమాల, శెట్టిగుంట కళాకృతులు, బొబ్బిలి వీణల కళాకారుల కోసం ఆయా ప్రాంతాల్లో వుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారు.సతీమణి అన్నా కొణిదెలతో కలిసి వుడ్ బ్యాంకులో సిద్ధంగా ఉంచిన కలప, క్లస్టర్లవారీగా కళాకారులు తయారు చేసిన కళాకృతులను తిలకించారు. పవన్ చొరవతో ప్రతి బొమ్మపైనా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, కళాకారుడి వివరాలు, తయారీ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి స్టాల్ వద్ద కళాకారులతో ముచ్చ టించి, బొమ్మల తయారీ విధానాన్ని, కళాకారుల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వుడ్ బ్యాంకులో నిల్వ ఉంచిన కలప దుంగలపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆ దుంగను ఎక్కడి నుంచి సేకరించారు, ఆ చెట్టు వయస్సు, శాస్త్రీయ నామం తదితర వివరాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సతీమణి అన్నా కొణిదలతో కలిసి కళా ప్రదర్శన తిలకించిన ఉప ముఖ్యమంత్రి పలు కళాకృతులు కొనుగోలు చేశారు.శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నీటిపారుదల సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ జ్యోతి, కన్జర్వేటర్ ఎన్. నాగేశ్వరరావు, అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్..సాగుపై చర్చకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

ఎనుముల రేవంత్‌రెడ్డి చాలెంజ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన సభలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని హితవు పలికారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా రూ.12 వేల చొప్పున రూ.36 వేల కోట్లను70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.

# చట్టబద్ధమైన పాలన, పారదర్శక న్యాయమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆశయాలకు అనుగుణంగా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అనుభవిస్తూనే, దేశ పౌరులుగా ప్రాథమిక విధులను అంతే బాధ్యతతో నిర్వర్తించడమే మనం ఆ అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆమె పేర్కొన్నారు.భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ,సమానత్వం,సామాజిక న్యాయ సూత్రాలను కాపాడటంలో న్యాయవ్యవస్థ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని జస్టిస్ లీసా స్పష్టం చేశారు.సమాజంలో వెనుకబడిన, నిరుపేద, మరియు బలహీన వర్గాల హక్కులకు భంగం వాటిల్లిన ప్రతి సందర్భంలోను కోర్టులు రక్షణ కవచంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సామాన్యుడికి సైతం అత్యంత తక్కువ ఖర్చుతో పారదర్శకంగా వేగవంతమైన న్యాయం అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

# భారత్ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుంది

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా దేశాల మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరుదేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు.భారత అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టంచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి రష్యా వ్యోమగాములు ప్యోటర్ దుబ్రోవ్, అన్నా కికీనా, ఆంద్రే ఫెద్యాయెవ్ కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు

**విజయవాడ, ఆగస్టు 15:**ఆగస్టు 15 ఓ తేదీ మాత్రమే కాదని.. చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య మైదానంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ అనిఅన్నారు. ఎన్టీఆర్ జిల్లా తరఫున నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని.. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ వాతావరణం చూశాక స్కూల్ రోజులు గుర్తుకు వచ్చాయని తెలిపారు. జెండాలు కట్టి, పోటీల్లో పాల్గొని జెండా పండుగ రోజు బహుమతులు అందుకునే వాళ్లమని చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతి ఇంటి పైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. విద్యా రంగంలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. పాఠ్యపుస్తకాలపై సీఎం ఫొటో, తన ఫొటో లేదని, ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలను వేశామన్నారు. విద్యను ఉపాధి రంగానికి అనుసంధానం చేస్తు న్నాం. రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించింది. పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ సాధించాం. అభివృద్ధి, సంక్షేమం మన ప్రభుత్వానికి జోడెద్దులు. పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చి రాష్ట్రానికి చిరునామాగా మారాయి. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇంకా ఎన్నేళ్లు ఉద్యోగాలు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాల వైపు చూస్తాం? అన్నిరంగాల్లో ఏపీని ముందువరుసలో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. కులం, మతం, ప్రాంతాలకతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రమాణం చేద్దాం. కసితో, పట్టుదలతో పనిచే ద్దాం. పక్క రాష్ట్రాలు మనవైపు చూసేలా అభివృద్ధి చేద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. అహిం సా మార్గం ద్వారా స్వాతంత్య్రం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని మంత్రి కొనియాడారు. ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లడం కాదని.. అమరావతి, విశాఖపట్నం, కర్నూలులో ఉద్యోగాలు చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కసితో పని చేసి 2047 నాటికి వికసిత ఏపీని సాధించాలన్నారు. స్వర్ణాంధ్రకు తగ్గట్టుగా ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. పక్క రాష్ట్రం వాళ్లు అసూయపడేలా ఏపీ అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు.వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమ, కలెక్టర్ లక్ష్మీశా, సీపీ రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

# ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనాలకు నిధుల విడుదల

**అమరావతి,ఆగస్టు 15:** రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపు నకు కూటమి ప్రభుత్వం రూ.22.50 కోట్లను మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్స రంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గౌరవ వేతనాలు చెల్లించేందుకు ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ నిధుల మంజూరు నిదర్శనమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇమా మ్‌లు, మౌజన్లకు క్రమం తప్పకుండా గౌరవ వేతనాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులు లోకేష్, ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో మైనారిటీల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్రంలోని ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందుతుందని, మూడు నెలలకు ఒక్కో ఇమామ్‌కు రూ.30 వేలు, ఒక్కో మౌజన్‌కు రూ.15 వేలు చొప్పున అందనున్నాయని పేర్కొన్నారు. మంజూరైన రూ.22.50 కోట్లను ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోకు విడుదల చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించిందని అబ్దుల్ అజీజ్ తెలిపారు. విడుదలైన నిధులను త్వరితగతిన ఇమామ్, మౌజన్ లకు అందిస్తామని తెలిపారు.

# చరిత్ర తెలుసుకుంటేనే ...భవిష్యత్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

# తెలుగువారికి చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి, ఆగస్టు 15:** పంద్రాగస్టు నేపథ్యంలో తెలుగు వారికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'తెలుగు వారికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ 80వ స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు. 80వ స్వాతంత్య దినోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్య్రం. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమే. అందుకు 'అనే నేను..' సంకల్పంతో దేశం నాకు ఏం చేసిందని కాదు.. దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలి'. 'మన చేతిలో జాతీయ జెండా ఉండాలి.. మన గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలి. 2047 నాటికి వికసిత్ భారత్.. స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. స్వరం స్వాతంత్య్రం నుంచి సమృద్ధి వైపు.. వికాసం నుంచి వైభవం వైపు ముందుకు సాగాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దాం. జై తెలుగుతల్లి! జై హింద్!' అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

## గుంటూరు వార్తలు
ఆదివారం, 16 ఆగష్టు 2026



## గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గుంటూరు, 15 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్వదేశీ ఖాదీ నుంచి ఆత్మనిర్భర్ భారత్ దాకా, బాధ్యతాయుత పౌరులే దేశ ప్రగతికి బాటలు వేసారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం (శ్రీనివాస రావు పేట)లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, జాతిపితమహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఎన్.సీ.సీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత కోసం ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయుడు వరకు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ వేదికపై అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఒకప్పుడు పేదరికం, ఆకలి, ఆశ్రయం వంటి ప్రాథమిక అవసరాల కోసం పోరాడిన దేశం నేడు స్వదేశీ సాంకేతికతతో విమానాలు తయారు చేసే స్థాయికి ఎదిగిందన్నారు. స్వదేశీ ఖాదీ నుంచి ఆత్మనిర్భర్ భారత్, చంద్రయాన్, కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతల వరకు భారతదేశం సాధించిన ప్రగతి ప్రతి భారతీయుడి గర్వకారణమని తెలిపారు. దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న సైనికుడి నుంచి సాధారణ పౌరుడి వరకు ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధిలో భాగస్వాములేనని, ఆర్థిక, వైజ్ఞానిక, క్రీడా రంగాల్లో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా తన ప్రతిభను చాటుకుంటోందని అన్నారు. కామన్వెల్త్ క్రీడల్లో దేశ జెండాను సగర్వంగా ఎగురవేసిన క్రీడాకారులకు, సమాజ సేవలో విశిష్ట కృషి చేసి పద్మ పురస్కారాలు అందుకున్న భారతీయులకు ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. ఈ లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డివిజన్ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## లాల్ జాన్ భాష సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 15 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** లాల్ జాన్ భాష రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడని,ఆయన సేవలు చిరస్మరణీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం గుంటూరు మాజీ పార్లమెంట్, రాజ్యసభ సభ్యులు, దివంగత కీ.శే. లాల్ జాన్ భాష వర్ధంతి సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సేవలను స్మరించు కున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. ప్రజలతో మమేకమై వారి అవసరాలను అర్థం చేసుకుని సేవలందించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని లాల్ జాన్ భాష చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## విద్యార్థుల్లో బాధ్యత స్ఫూర్తి పెరగాలి : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 15 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేళ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జాతీయ జెండా రెపరెపలాడింది. ప్రతి గుండెలో దేశభక్తి ఉప్పొంగింది. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. మువ్వన్నెల జెండాకు వందనం చేశారు. తొలుత స్థానిక తూర్పు కార్యాలయం, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం, అంజుమన్ పాఠశాల, బీఆర్ స్టేడియం కాంప్లెక్స్, కల్ప అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగడిగుంట చాకలిబజారు, నల్లచెరువు మినీ లారీ స్టాండ్, ఇక్బాల్ మసీద్ కాంప్లెక్స్, బేరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాయాబజార్, పల్నాడు బస్టాండ్ ఆటోస్టాండ్, తారకరామనగర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకాని రోడ్డు, ముస్లిం కబరస్తాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్, పూల మార్కెట్, బ్రైట్ హారిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంజుమన్



షాదీఖానా వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, రాజ్యాంగ విలువలను తెలుసుకోవాలని సూచించారు. విద్య ద్వారా పొందే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులను గౌరవించడం, వారి కష్టాలను అర్థం చేసుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యత అని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలన్నారు. చదువు మన భవిష్యత్తుకు బాట వేస్తే, దేశభక్తి మన వ్యక్తిత్వానికి బలం ఇస్తుందని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో విద్య, వైద్య రంగాలతోపాటు పారిశ్రామిక అభివృద్ధి వేగవంతంగా సాధించామన్నారు. మహిళా సాధికారతకు ఉచిత బస్సు ప్రయాణం, 33శాతం మహిళా రిజర్వేషన్ వంటి అంశాలు బలం చేకూర్చాయని చెప్పారు. తొలుత అంజుమన్ షాదీఖానాలో ఎమ్మెల్యే నసీర్ రక్తదానం చేశారు.

## టిడిపి కార్యలయం లో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**గుంటూరు, 15 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ ;** 80 స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయమంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మహమ్మద్ నశీర్ అహ్మద్, టిడిపి జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావుతో కలిసి జాతీయ జెండాను శనివారం ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, గుం టూరు, ఆంధ్ర ప్రదేశ్, భారతదేశ ప్రజలకు 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలన్నారు. లక్షలాదిమంది స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణత్యాగాలకు నిదర్శనం మన భారతదేశం. 80 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో మన దేశం ఎంతో ముందుకు వెళ్ళింది. ఎక్స్పోర్ట్స్, డిఫెన్స్, ఎయిర్ ఫోర్స్ వంటి ఎన్నో రంగాలలో అధునాతన విధంగా మన భారతదేశ ముందుకు వెళుతోంది. యువత, మహిళలు, రైతులు అందరూ తమ సంకల్పాన్ని భారతదేశ అభ్యున్నతికి ఉపయోగించాలి. ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందాలి. అందరికీ మరొక్కసారి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, టిడిపి నాయకులు ముత్తినేని రాజేష్, వేములపల్లి శివరామకృష్ణ ప్రసాద్ (బుజ్జి), చిట్టాబత్తిన చిట్టిబాబు, డా.నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత - పర్యావరణ పరిరక్షణకు కంపోస్ట్ బాక్స్ ఏర్పాటు



**గుంటూరు, 15 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జ్యోతిర్మయి అపార్ట్మెంట్ (పామ్ స్ప్రింగ్స్)లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ వాసుల కోసం వంటగదిలోని కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేసే కంపోస్ట్ బాక్స్‌ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఏర్పాటు చేశారు. తడి వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా స్వచ్ఛతతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో పరిశుభ్రమైన, హరితమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు, నివాసితులు పాల్గొన్నారు.


## మ్యాట్రిక్స్ ఒలింపియాడ్ స్కూల్లో విశిష్ట అతిథుల సందడి



**చిలకలూరిపేట, 15 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చిలకలూరిపేట పట్టణంలోని బ్యాంక్ కాలనీ నందు ఉన్న మ్యాట్రిక్స్ ఒలింపియాడ్ స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆ స్కూల్ డైరెక్టర్ కె.సూర్యతేజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మ్యాట్రిక్స్ ఒలింపియాడ్ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ రామసీత, పాస్ట్ ప్రెసిడెంట్ జయలక్ష్మి, డిస్ట్రిక్ట్ ఎడిటర్ ఇందిర ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులతో కలసి జాతీయ గీతం ఆలపించి జండాను ఎగురవేశారు. అనంతరం ఇన్నర్ విల్ ప్రెసిడెంట్, పాస్ట్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, విద్యార్థులు దేశాభివృద్ధిలో బాధ్యతా యుతమైన పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.సూర్య తేజ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, దేశం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతను గుర్తుచేసే మహత్తరమైన విలువ అని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, జ్ఞానం మరియు దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేకాకుండా పాఠశాల డైరెక్టర్ సూర్య తేజ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి ఒక్క విద్యార్థితో దేశ స్వతంత్రం కోసం పోరాడిన ఎందరో మహానుభావుల అవతారాలను విద్యార్థుల చేత వేయించి విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఇన్నర్ విల్ ప్రెసిడెంట్ లకు ఆశ్చర్యానికి గురి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సెంచూరియన్ స్కూల్లో ఘనంగా 80 స్వతంత్ర దినోత్సవ వేడుకలు





**కొత్తవలస, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలదిమ్మ వద్ద నున్న సెంచూరియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు చిన్నారులందరూ ఝాన్సీ లక్ష్మీబాయి మహాత్మా గాంధీ భగత్ సింగ్ సుభాష్ చంద్రబోస్ వివిధ రకాల గెటప్పుల్లో అలరించారు అలాగే క్విజ్ మరియు ఆటలలో గెలుపొందినవారికి మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొత్తవలస సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.వి. విజయకుమార్ మరియు మాజీ ఆర్మీ అధికారులు ఏ. అశోక్ కుమార్ పి.సన్యాసిరావు మరియు తైక్వాండో ములపర్తి ప్రకాష్ పాల్గొని దేశం యొక్క గొప్పతనాన్ని మరియు ఐక్యత గా ఉండాలని విద్యార్థులు మొబైల్ కు దూరంగా ఉండాలని సూచించారు. సెంచూరియన్ స్కూల్ ప్రిన్సిపల్ బగాది రమణ మరియు కరస్పాండెంట్ పైడి ప్రసాదులు మాట్లాడుతూ సెంచురియన్ స్కూల్ చదివిన విద్యార్థులకు నవోదయ. మరియు సైనిక్ స్కూలు చాలా మందికి ఎంపికయ్యారు. సెంచరియన్ స్కూల్ ప్రతి విద్యార్థులు మంచి స్థానంలో మార్కులు సాధిస్తున్నారని అన్నారు.

## హిందుస్థాన్ డిఫెన్స్ అకాడమీలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కొత్తవలస, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరం జిల్లా కొత్తవలసలోని హిందుస్థాన్ డిఫెన్స్ అకాడమీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి, జాతీయ సమైక్యత, సైనిక సేవల పట్ల విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కవాతు, క్రీడా నైపుణ్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మీ రిటైర్డ్ కల్నల్ ఎల్.సి.ఎస్. నాయుడు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డిఫెన్స్ సర్వీసుల్లో చేరాలనే లక్ష్యంతో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. కేవలం చదువులో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాకుండా, విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా సమాజానికి, దేశానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. హిందుస్థాన్ డిఫెన్స్ అకాడమీ యాజమాన్యం విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణతో కూడిన శిక్షణ భవిష్యత్తులో డిఫెన్స్ సర్వీసుల్లో రాణించేందుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. స్వాతంత్ర్యం సాధించడానికి జరి గిన పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి కుటుంబాలు కూడా ఎన్నో కష్టాలను, త్యాగాలను భరించాయని వక్తలు గుర్తుచేశారు. అమరవీరుల కుటుంబాలకు సమాజం ఎల్లప్పుడూ అండగా నిలవాలని, వారి త్యాగాలను గౌరవిస్తూ మనో నిబ్బరంతో ముందుకు సాగేలా ధైర్యం కల్పించాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం వెనుక అమరవీరుల కుటుంబాల త్యాగాలు కూడాఉన్నాయని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు దేశభక్తి, జాతీయ సమైక్యత, సైనిక సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కృషి చేసి దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ ఎస్.సత్యారావు, మాజీ సైనికులు పి. సత్యనారాయణ, హవాల్దార్ జి.ఎ. నాయుడు, హవాల్దార్ ఢిల్లీ రావు, ఇంటర్నేషనల్ అథ్లెట్ జి. సీతారాం, నేషనల్ అథ్లెట్ హవాల్దార్ ఈ.వి.ఎస్.ఆర్.కె.చైతన్య, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో ప్రాంగణం మార్మోగగా, వేడుకలు ఉత్సాహభరితగా ముగిశాయి.

## పోలీస్ కార్యాలయాల్లో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**గుంటూరు, 15 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఐజీ క్యాంప్ ఆఫీస్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుంటూరు రేంజ్ ఐజీపీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి,ఐజీ బంగ్లాలోని క్యాంప్ ఆఫీస్ ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ నారాయణ, ఐజీ కార్యాలయ సిబ్బంది, పోలీస్ బ్యాండ్ సిబ్బంది, బంగ్లా సిబ్బంది, రిజర్వ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

**గుంటూరు ఎస్పీ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు :** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు, శ్రీహరి రెడ్డి, ఆర్ఎ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్ఎస్ఐ బాల శంకర్ మరియు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం సీఐ ఎ. సుబ్రహ్మణ్యంకు ఉత్తమ సేవా పథకం



**ఇబ్రహీంపట్నం, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఇబ్రహీంపట్నం సీఐ ఎ. సుబ్రహ్మణ్యంకు ఉత్తమ సేవా పథకం లభించింది. శనివారం నగరంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు సమక్షంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆయన పథకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సుబ్రహ్మణ్యంకు పలువురు అభినందనలు తెలిపారు.

## ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఇబ్రహీంపట్నం, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కొండపల్లి బీ కాలనీ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కార్యదర్శి డేవిడ్ రాజ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆనాడు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే నిజమైన స్వాతంత్ర్యం అని, ఆ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ హాఫీజ్ ఖాద్రీ, ఏవో బాషా, కోశాధికారి రాంబాబు, సహాయ కార్యదర్శి రహీం, క్రాంతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం - పీఎం సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థిక భరోసా

### లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్




**కాకినాడ బ్యూరో, 15 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి, పీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను శనివారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయనిధి, ప్రధానమంత్రి సహాయనిధి ద్వారా పేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, అర్హత ఉన్న వారికి సహాయం అందేలా సిఫార్సులు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల కాలంలో పార్లమెంట్ పరిధి నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 8 మంది లబ్ధిదారులకు రూ.19,60,666, పీఎం ఆర్ఎఫ్ ద్వారా ముగ్గురు లబ్ధిదారులకు రూ.6,75,000 మంజూరయ్యాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ రెండేళ్ల కాలంలో కాకినాడ పార్లమెంట్ పరిధిలో సీఎం మరియు పీఎం సహాయనిధి ద్వారా 50 మంది లబ్ధిదారులకు రూ. 1,01, 02, 542 అందించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా విచ్చేసి సందేశం ఇచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొనదెల పవన్ కళ్యాణ్






**కాకినాడ బ్యూరో, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో సందేశం ఇచ్చారు. ఈ తీర ప్రాంతం నుంచి జాతీయ పతాకం సాక్షిగా మన స్వాతంత్ర్యాన్ని స్మరించుకుంటున్న ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనది. 80 సంవత్సరాలు అంటే దాదాపు 8 దశాబ్దాల భారత ప్రయాణం ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడింది. ఒక తరం ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడింది. మరో తరం దేశ నిర్మాణానికి పునాదులు వేసింది. మన రాజ్యాంగ ప్రాథమిక విధుల్లో 'ప్రతి పౌరుడు శాస్త్రీయ, మానవతా, పరిశీలనా,సంస్కరణ దృక్పథాలను' పెంపొందించుకోవాలని తెలిపారు. మనందరికీ మన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కు ఉంది,అది మన ప్రజాస్వామ్యానికి చాలా గొప్ప బలం కానీ ఆ స్వేచ్ఛని ఇతరులను దూషించడానికి తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడానికి ఉపయోగించకూడదు. బలమైన ప్రజాస్వామ్యానికి మనకి కావాల్సింది బ్లైండ్ ఫాలోవర్స్ కాదు ఇన్ఫార్మ్డ్ సిటిజన్స్ చాలా అవసరం. మీ చేతుల్లో మొబైల్ ఉంది, టెక్నాలజీ ఉంది, ఇన్ఫర్మేషన్ ఉంది, ఓటు ఉంది, టాలెంట్ ఉంది, కానీ అన్నిటికంటే ముఖ్యంగా మీ చేతుల్లో మీ భవిష్యత్తు ఉంది, దేశ భవిష్యత్తు ఉంది. ప్రతి తరం తన కాలానికి ఒక బాధ్యతను మోస్తుంది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, నేతాజీ వంటి యువకుల స్ఫూర్తితోటి ఆ రోజున దేశం కోసం త్యాగాలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తర్వాత తరాలు దేశ నిర్మాణానికి పునాదులు వేసాయి. ఇప్పుడు ఆ జాతీయ నిర్మాణపు జ్యోతిని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం మన యువతది. భారతదేశానికి ప్రతిభలో కొదవలేదు, అవకాశాలు కావాలి, అవకాశాలను సృష్టించే సమయం ఇది. ప్రపంచంలోని పెద్ద సంస్థలకు నాయకత్వం వహిస్తున్న భారతీయుల నుంచి అంతరిక్షం నుంచి డిజిటల్ టెక్నాలజీ వరకు భారత్ సాధిస్తున్న విజయాల వరకు మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పే మన సామర్థ్యానికి ప్రపంచమే సాక్షి. కాబట్టి యువతకి నా పిలుపు ఒక్కటే డబ్బుకి మీ ఓటును అమ్ముకోకండి తప్పుడు సమాచారానికి మీ ఆలోచనను అమ్ముకోకండి ద్వేషానికి మీ భవిష్యత్తుని అప్పగించకండి. ప్రశ్నించే యువత కావాలి పరిష్కారం చూపే యువత కావాలి అవకాశాలు సృష్టించే యువత కావాలి భారతదేశాన్ని నడిపించే యువత కావాలి. ఈ తరం చేతిలో ఉన్న జ్యోతి యువత వచ్చే తరాలకి మరింత ప్రకాశవంతమైన భారతదేశంగా మీ చేతుల్లో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొనదెల పవన్ కళ్యాణ్ తెలియజేశారు.

# సెంట్ మార్క్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు






**కాకినాడ బ్యూరో, 15 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దేశభక్తి, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులను తీర్చిదిద్దడంలో, విద్య రంగంలో ను సెంట్ మార్క్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కీలక పాత్ర అని ప్రిన్సిపల్ ఉత్తేజ్ డానియల్ అన్నారు. సెంట్ మార్క్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ తూరంగి ప్రాంగణంలో, నూతన క్యాంపస్ జెడ్ భావారం కరప మండలంలో కూడా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నులపండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్ మార్క్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ కె. వరప్రసాద్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో విద్యార్థులు కష్టపడి చదువుకోవడంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దేశం కోసం సేవ చేయాలనే స్ఫూర్తిని చిన్ననాటి నుంచే పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పెంకె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు

**జగ్గంపేట, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని శనివారం అమృత రెస్టారెంట్ ప్రాంగణంలో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు పెంకే శ్రీనివాస్ అధ్యక్షత వహించి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాట్రావులపల్లి గ్రామ ఎన్నారై కళ్ళేపల్లి రాజేష్ మరియు గ్రామ మాజీ సర్పంచ్ పిట్టా సుగుణ రావు ఇద్దరు చేతులు మీదుగా జాతీయ జెండా ఎగరవేసి స్వీట్లు చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరము పెంకె శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 50 మందికి వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుడాల శాంతి ప్రసాద్ రావు, దుర్గారావు, తోలాటి వీర బాబు, ఎన్న వీరబాబు, మాదబోయిన సూరిబాబు, గుంట ముక్కల వీర బాబు, గొల్లపల్లి సత్తిబాబు, కాటే జగపతి తదితరులు పాల్గొన్నారు.



# చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది

### దేశభక్తి - క్రమశిక్షణ - నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి
### జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్




**కాకినాడ బ్యూరో, 15 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రతి పౌరుడికి బాధ్యత ఉందని, దేశభక్తి అనేది కేవలం ఒక రోజు మాత్రమే కాకుండా నిత్య జీవితంలో ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన ప్రవర్తనలో ప్రతిబింబించాలని సూచించారు. పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరూ దేశ సేవను అత్యంత గౌరవంగా భావించాలని, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, నిష్పక్షపాత వైఖరి, దృఢ సంకల్పం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయడం పోలీసుల ప్రధాన బాధ్యత అని, సమాజంలో ఎక్కడైనా అన్యాయం, అక్రమం, నేరం చోటుచేసుకున్నప్పుడు దానిని నిర్భయంగా ఎదుర్కొని చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. అదే సమయంలో ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుభూతితో విని, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న బలమైన, సురక్షితమైన, అభివృద్ధిచెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, వారు దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా.మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, డీటీఆర్బీ ఇన్స్పెక్టర్ బి. రాజశేఖర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ఎ. సన్యాసిరావు, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, కార్యాలయ పరిపాలనాధికారి ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

# పెదరావుపల్లి రైతుల జీవనాధారంపై క్రషర్ మాఫియా వేటు !

### రాత్రికి రాత్రే 20 ఎకరాల తోట ధ్వంసం
### జేసీబీలతో మొక్కలు నేలమట్టం





**విజయనగరం/పెదరావుపల్లి, 15 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గం, కొత్తవలస మండలం పెదరావుపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిని నమ్ముకుని బతుకుతున్న పేద రైతులపై క్రషర్ మాఫియా కన్ను పడింది. రాత్రి వేళ జేసీబీలతో వచ్చి 20 ఎకరాల తోటను పూర్తిగా ధ్వంసం చేశారు. పెదరావుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 1/1లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ వెస్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ భూమిని గతంలో ప్రభుత్వం బాధిత రైతులకు సాగు కోసం కేటాయించింది. అప్పటి నుంచి ఆ రైతులు ఆ భూమిలో జీడి, మామిడి మొక్కలు నాటి, వాటిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ గత కొన్ని రోజులుగా స్థానిక క్రషర్ యజమాని ఆధ్వర్యంలోని వ్యక్తులు ఆ భూమిపై కన్నేశారు. ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, రాత్రి సమయంలో జేసీబీలతో తోటలోకి చొరబడి, సంవత్సరాల కష్టంతో పెంచిన జీడి, మామిడి మొక్కలను పూర్తిగా పెకిలించి, భూమిని చదును చేశారు.

**"పర్మిషన్ ఉంది" అంటూ బెదిరింపులు :** దీనిని ప్రశ్నించిన రైతులను "ఈ భూమికి ప్రభుత్వ మైనింగ్ అనుమతులు ఉన్నాయి. మీకు తోచింది చేసుకోండి" అంటూ బెదిరించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక్కసారిగా తోటలు ధ్వంసం కావడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యారు. "మా బతుకులు రోడ్డుపాలయ్యాయి. ఇన్ని సంవత్సరాలు కష్టపడి పెంచిన తోటలను ఒక్క రాత్రిలో నాశనం చేశారు. ఇప్పుడు మా కుటుంబాలు ఏం తినాలి?" అని బాధిత రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

**రైతుల డిమాండ్ :** ఈ అన్యాయంపై ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని రైతులు కోరుతున్నారు. బాధ్యులైన క్రషర్ యజమాని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు జరిగిన నష్టానికి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# దమ్ముంటే అడ్డుకోండి

**భాగ్యలక్ష్మి అమ్మవారి వద్ద లక్షల మందితో వందేమాతరం పాడిస్తా**

**ఎంఐఎం, కాంగ్రెస్కు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్**

**సనాతన ధర్మాన్ని కించపరచడమే కాంగ్రెస్ సిద్ధాంతం: లక్ష్మణ్**

**హైదరాబాద్, ఆగస్టు 15:** హైదరాబాద్, పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద లక్ష లాది మంది బీజేపీ కార్యకర్తలతో త్వరలో వందేమాతరం గీతాలాపన చేయిస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ఎంఐఎం, కాంగ్రెస్కు దమ్ముంటే అడ్డుకోవాలని సవాల్ చేశారు. సనాతన ధర్మాన్ని కించ అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్య పరచడమే కాంగ్రెస్ రెండు కళ్ల సిద్ధాంతం క్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్, కె. లక్ష్మణ్ వేర్వే రుగా విలేకరులతో మాట్లాడారు. రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీకి కేంద్ర ప్రభుత్వమే నిధులు, బియ్యం ఇస్తుంటే స్మార్ట్ రేషన్కార్డులపై ప్రధాని ఫొటో ముద్రించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరమేంటని బండి సంజయ్ నిలదీశారు. కేంద్రం నిధులు వద్దు అనుకుంటే ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో మహాదోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఇక, జెనీ పట్ల ప్రేమ ఉంటే తక్షణమే 10 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి ఆ స్థానాల్లో జెనీని నిలబెట్టి గెలిపించి వాళ్లను మంత్రులను చేయాలని బండి సంజయ్ కాంగ్రెస్కు సూచన చేశారు. కాగా, ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కాస్తా యాంటీ ఇండియా కాంగ్రెస్ కమిటీగా మారిపోయిందని లక్ష్మణ్ ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో సాధువులు, సన్యాసుల వేషాలు వేసి సనాతన ధర్మాన్ని కించపరిచారని లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణాలో సీఎం రేవంత్ రెడ్డి రెండు 'కళ్ల సిద్ధాంతం' పేరుతో సనాతన ధర్మాన్ని దెబ్బతీస్తున్నారని, ఆలయాలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజ్యాంగ విరు ద్ధమైన 4 శాతం మతపరమైన ముస్లిం రిజర్వేషన్లను కొనసాగిస్తామని రేవంత్ రెడ్డి బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జా తీయ దౌత్యంపై కనీస అవగాహన లేని రాహుల్ గాంధీ.. రాజకీయాల్లో జోకర్ పాత్ర పోషిస్తున్నారని దుయ్యబట్టారు. విపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా 2029 ఎన్నికల నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి దేశవ్యా ప్తంగా 800 పైగా ఎంపీ స్థానాలను, తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానా లను రాజ్యాంగబద్ధంగా పెంచుతామని లక్ష్మణ్ వివరించారు.

## చరిత్ర తెలుసుకుంటేనే ... భవిష్యత్ నిర్మాణం

**టీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత**

**హైదరాబాద్,ఆగస్ట్15:** చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శించారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్నట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి

**పాడైన ఆహార పదార్థాల తయారీ గుర్తింపు**

**రంగారెడ్డి,ఆగస్ట్15:** కల్తీ ఆహార తయారీ కేంద్రంపై హెచ్ఫాస్ట్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ, టాస్క్ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. జిల్లాలోని బొంగుళూర్లో ఫుడ్ ప్రొడక్ట్స్పై జరిపిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గడువు ముగిసిన ముడిసరుకులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లేబుల్స్ లేని రసాయన సువాసన ద్రవ్యాలతో నాసిరకం ఆహారాన్ని తయారు చేస్తునట్టు తేలింది. నిర్వాహకులు అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారీ చేస్తున్నట్లు అధికారుల దాడుల్లో బయటపడింది. వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో ఈజీ మనీ కోసం అక్రమంగా నాణ్యత లేని ఆహారపదార్థాల తయారీకి ప్లాన్ చేసినట్లు గుర్తించిన అధికారులు.. తనిఖీల అనంతరం యజమాని మహ్మద్ ఖాలీద్, మేనేజర్ సంతోష్ కుమార్ను అరెస్ట్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో దాదాపు 4.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ముడిసరుకు గడువు ముగిసిన ఫ్లేవర్లు, కాజూ, కొబ్బరి పొడి తదితర పదార్థాలను సీజ్ చేసిన అధికారులు.. నిందితులపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

## సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

**రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా విడుదల**

**ఎమ్మెల్యే పాయంతో కలసి విడుదల చేసిన మంత్రి తుమ్మల**

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్15:** ఎల్నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాజీవ్ లింక్ కెనాల్కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. శనివారం అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైప్లైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యథావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని మృతి

**హైదరాబాద్,ఆగస్ట్15 :** ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వందన హోటల్ సమీపంలో స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఓ ఇంటర్ విద్యార్థిని దుర్మరణం చెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడకు చెందిన సురేష్ తన భార్య, కుమార్తె శ్రావణితో కలిసి స్కూటీపై సొంత గ్రామానికి వెళ్తున్నారు. వందన హోటల్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన లారీ వారి స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో శ్రావణి రోడ్డుపై పడిపోగా.. ఆమెపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఘట్కేసర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రెండేండ్ల తర్వాత కేసీఆర్ సీఎం

- తెలంగాణ మళ్లీ అభివృద్ధి బాట పట్టడం తథ్యం
- దేశంలో తెలంగాణ కంటే మెరుగ్గా పనిచేసిన ఒ ఒక డబుల్ ఇంజన్ రాష్ట్రాన్ని చూపెట్టండి!
- డబుల్ ఇంజన్ కాదు..28 ఇంజిన్లు పరుగెత్తాలె
- రాష్ట్రాల సమాన అభివృద్ధే అసలైన దేశభక్తి: కేటీఆర్
- స్వాతంత్ర్యం వచ్చి 80 ఏండ్లవుతున్నా నేటికీ రోడ్లు, బడులు, కరెంట్ లేని ఊర్లుండుడేంది?
- దేశంలో నాయకత్వ లోపం స్పష్టంగా ఉన్నది
- ప్రపంచవ్యాప్తంగా మహాత్ముడిని గౌరవిస్తుంటే దేశంలో మాత్రం ఆయనను అవమానిస్తున్నరు
- గాంధీని చంపినోళ్లను కీర్తించడం బాధాకరం
- కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని పట్టలెకిద్దాం
- పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించుకుందాం
- కాంగ్రెస్ దుష్టపాలనను ఊరూరా ఎండగడుతాం
- స్వాతంత్ర్య వేడుకల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్లో జాతీయ జెండా ఆవిష్కరణ



**హైదరాబాద్, ఆగస్టు 15:** 'దేశంలో 28 రాష్ట్రాలున్నయ్. 28 ఇంజిన్లున్నయ్. అన్ని రాష్ట్రాలు బలంగా పనిచేస్తేనే దేశం వేగంగా ముందుకు సాగుతుంది. ఒక డబుల్ ఇంజిన్తో దేశం అభివృద్ధి చెందదు. తెలంగాణలో ఒక ఇంజిన్తోనే కేసీఆర్ ప్రభుత్వం అనేక రంగాల్లో మెరుపువేగంతో దూసుకెళ్లింది. తెలంగాణ కంటే మెరుగ్గా పనిచేసిన ఒక డబుల్ ఇంజిన్ రాష్ట్రాన్ని చూపించండి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. రెండేండ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ తిరిగి అభివృద్ధి బాట పడుతుందని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ కార్యక్రమాలను మరింత విస్తరిస్తూ కేసీఆర్ను మళ్లీ సీఎం చేసుకునే దిశగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సబ్బండవర్ణాలను మోసం చేసిన కాంగ్రెస్ దుష్టపాలనను గ్రామగ్రామాన ఎండగడుతామని స్పష్టంచేశారు. దేశంలో తీవ్ర నాయకత్వ లోపం ఉన్నదని, స్వాతంత్ర్యం వచ్చి 80 ఏండ్లు కావస్తున్నా ఇంకా అనేక గ్రామాల్లో కనీస రోడ్లు, విద్యుత్తు, పాఠశాలలు లేకపోవడం విచారకరమని వాపోయారు.

ప్రజలకు అవకాశాలు, రైతులకు భరోసా కల్పిస్తూ అన్ని రాష్ట్రాల సమాన అభివృద్ధే అసలైన దేశభక్తి అని స్పష్టంచేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్లో శనివారం కేటీఆర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర, దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు వ్యక్తిగత, ప్రాంతీయ, భాషా, మత, కుల, రాష్ట్రపరమైన గుర్తింపులు ఎన్ని ఉన్నా అన్నింటికంటే ముందుగా మనమంతా భారతీయులమని, భారతీయత అనే భావమే దేశ ప్రజలందరినీ ఒకటిగా నడిపిస్తున్నదని తేల్చిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మహాత్మాగాంధీని గొప్పగా గౌరవిస్తుంటే, మనదేశంలో మాత్రం ఆయనను అవమానించేలా, ఆయనను హత్య చేసిన వారిని కీర్తించేలా కొందరు వ్యవహరించడం బాధాకరమని వాపోయారు.

### నేటికీ కనీస సౌకర్యాల్లేవెందుకు?

భారతదేశంలో సహజ వనరులకు కొదువ లేదని, కానీ నేటికీ అనేక గ్రామాల్లో కనీస వసతులు లేవని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలోని నదుల ద్వారా 70 వేల టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని, అయినా సాగునీటి కోసం రైతులు, తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతు న్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందాలని కేసీఆర్ ఆకాంక్షించారని గుర్తుచేశా రు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచినా దేశంలోని నీటి వనరులను సమర్థంగా ఎలా వినియో గించుకోవాలన్న దానిపై సమగ్ర ప్రణాళిక లేకపోవడం విచారకరమని వాపోయారు. 24 గంటల కరెంట్ సరఫరా చేయగల స్థాపిత విద్యుత్తు సామర్థ్యం ఉన్నా గ్రిడ్ కనెక్టివిటీ లేకపోవడం, పాలకుల చిత్తశుద్ధి కొరవడటంతో కరెంట్ సమస్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు.

### చైనా ఎకడున్నది? భారత్ ఎకడున్నది?

జనాభా ఎకువగా ఉండటం వల్ల భారతదేశం అభివృద్ధి చెందలేకపోతున్నదనే వాదనలో వాస్తవం లేదని కేటీఆర్ చెప్పారు. దీనికి చైనాను ఉదాహరణగా తీసుకోవాలని సూచించారు. నాలుగు దశాబ్దాల క్రితం భారత్తో పోలిస్తే చైనా ఆర్థికంగా వెనుకబడి ఉన్నదని, 1980ల ప్రారంభంలో చైనా ఆర్థిక వ్యవస్థ భారత్ కంటే పేదదిగా ఉండేదని గుర్తుచేశారు. పట్టుదల, దీర్ఘకాలిక ప్రణాళిక, స్పష్టమైన లక్ష్యాలతో చైనా నాలుగు దశాబ్దాల్లో అమెరికా వంటి అగ్రదేశాలతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని గుర్తుచేశారు. 1980లలో భారత్-చైనా ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ముందున్నా, నేడు చైనా ఆర్థిక వ్యవస్థ 20 ట్రిలియన్ డాలర్లకుపైగా ఉన్నదని, భారత్ సుమారు 3.4 ట్రిలియన్ డాలర్ల వద్ద ఉన్నదని తెలిపారు. మనకంటే దాదాపు ఆరు రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా ఎదిగిందని చెప్పారు. భారత్కు సహజ, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నా దేశాన్ని ముందుకు నడిపించే స్పష్టమైన నాయకత్వం, దీర్ఘకాలిక ప్రణాళిక, చిత్తశుద్ధి లోపించాయని విమర్శించారు.

### దేశానికి నాయకత్వమే కొరవడింది

తాను ఒక పార్టీ నాయకుడిగా కాకుండా సగటు భారతీయుడిగా మాట్లాడుతున్నానని కేటీఆర్ తెలిపారు. తన పిల్లలు దేశంలోనే ఉండి చదువుకొని, ఉద్యోగాలు చేసి, అభివృద్ధి చెందే పరిస్థితి రావాలని కోరుకుంటున్నానని చెప్పారు. 'మన పిల్లలు చదవడానికి అమెరికా వెళ్లాల్సిన అవసరం ఎందుకు రా వాలి? ఇకడే ప్రపంచ స్థాయి విద్యాసంస్థలు ఎం దుకు ఉండకూడదు?' అని ప్రశ్నించారు. ఐఐటీలు, ఐఐఎంల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఏర్పాటు చేసినా అవకాశాల కోసం దేశంలోని ప్రతిభావంతులైన యువత విదేశాలకు వెళ్తూనే ఉన్నదని చెప్పారు. దేశంలోనే ప్రపంచస్థాయి విద్య, ఉపాధి, పరిశోధన, వ్యాపార అవకాశాలు కల్పించి ప్రతిభావంతులను బయటకు వెళ్లకుండా పరిస్థితులను మార్చాల్సిన బాధ్యత పాలకులపై ఉన్నదని చెప్పారు. భారత్లో కొరవడింది వనరులు కాదని, నాయకత్వమేనని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.

### తెలంగాణ మాడల్ అమలు కావాలి

కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో తొమ్మిదిన్నరేండ్లలో అమలు చేసిన పథకాలు, సాధించిన ఫలితాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలనే ఉద్దేశంతోనే భారత రాష్ట్ర సమితి ఆవిర్భవించిందని కేటీఆర్ గుర్తుచేశారు. భారతదేశంలో నీళ్లు, విద్యుత్తు, వ్యవసాయం, సంక్షేమం, మౌలిక వసతులు వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక అవసరమని కేసీఆర్ ఎప్పటినుంచో చెప్తున్నారని గుర్తుచేశారు. తెలంగాణలో సాధ్యమైన మాడల్ దేశవ్యాప్తంగా ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో అనేక మార్పులు తీసుకొచ్చారని, విద్యుత్తు సమస్యను అధిగమించి 24 గంటల కరెంటు అందించారని, సాగునీటి విస్తరణ చేపట్టారని, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, కంటి వెలుగు వంటి అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని వివరించారు.

### డబుల్ ఇంజిన్తో అభివృద్ధి జరుగదు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'డబుల్ ఇంజిన్' నినాదాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్న వాదన సరికాదని చెప్పారు. 'దేశంలో 28 రాష్ట్రాలున్నయ్. 28 ఇంజిన్లు ఉన్నయ్. అన్ని రాష్ట్రాలు బలంగా పనిచేస్తేనే దేశం వేగంగా ముందుకు సాగుతుంది. ఒక డబుల్ ఇంజిన్తో దేశం అభివృద్ధి చెందదు' అని స్పష్టంచేశారు. రాజకీయ విభేదాల కారణంగా రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. హైదరాబాద్లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు లక్డీకాపూల్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు మెట్రో విస్తరణకు అనుమతి కోరినా నాడు కేంద్రం స్పందించలేదని గుర్తుచేశారు. అదే సమయంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో చిన్న పట్టణాలకూ మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేశారని విమర్శించారు.

### తెలంగాణభవన్కు రెండు దశాబ్దాలు

ఆగస్టు 14తో తెలంగాణభవన్ నిర్మాణానికి సరిగ్గా 20 ఏండ్లు పూర్తయ్యాయని కేటీఆర్ తెలిపారు. రెండు దశాబ్దాల ప్రయాణంలో ఈ భవనం కేవలం పార్టీ కార్యాలయంగా కాకుండా తెలంగాణ ఉద్యమ చరిత్రకు, పార్టీ ప్రస్థానానికి, కార్యకర్తల త్యాగాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పారు. 2001లో తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సమయంలో కేసీఆర్కు కొండా లక్ష్మణ్ బాపూజీ జలదృశ్యంలో తన నివాసాన్ని అందించారని గుర్తుచేశారు. 'ఇకడి నుంచే పార్టీ, ఉద్యమం నడపండి.. నా ఇంటి నుంచే నడపండి' అని బాపూజీ పార్టీకి ఆశ్రయం ఇచ్చారు. అకడే తెలంగాణ జెండా ఎగిరింది' అని గుర్తుచేశారు. అయితే అప్పటి ప్రభుత్వం అర్ధరాత్రి చెప్పాపెట్టకుండా పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేయిం చి, సామగ్రిని బయటకు తీసి, ప్రభుత్వ స్థలమని చె ప్పి అకడి నుంచి వెళ్లగొట్టిందని గుర్తుచేశారు. కొం తకాలం నందినగర్లో కేసీఆర్ నివాసం నుంచే పార్టీ కార్యకలాపాలు సాగాయని, అనంతరం ఎమ్మెల్యే క్వార్టర్స్లో చిన్న కార్యాలయం ఏర్పాటు చేసుకొని పార్టీ కార్యక్రమాలను కొనసాగించామని తెలిపారు. 2004లో ప్రజల మద్దతుతో కేసీఆర్ యూపీఏ ప్రభుత్వంలో చేరిన అనంతరం పార్టీకి శాశ్వత కార్యాలయం ఉండాలనే ఆలోచన బలపడిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి, పార్టీ నిర్మాణానికి ఒక శాశ్వత కేంద్రం అవసరమని కేసీఆర్ పట్టుదలగా నిర్ణయించి తెలంగాణభవన్ కోసం స్థలాన్ని ఎంపిక చేశారని వివరించారు. తెలంగాణభవన్ నిర్మాణం వెనుక కేసీఆర్ దూరదృష్టి ఉన్నదని కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, నవీన్కుమార్, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మ య్య, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్రావు, ని రంజన్రెడ్డి, మాజీ ఎంపీలు కేఆర్ సురేశ్రెడ్డి, రావుల చంద్రశేఖర్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్నాయక్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్యాదవ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవికుమార్, చిరుమళ్ల రాకేశ్, వెంకటేశ్వర్రెడ్డి, తలసాని సాయికిరణ్యాదవ్, కిశోర్గౌడ్, ఉమ, సుమిత్రానంద్ పాల్గొన్నారు.

# సంగారెడ్డి సభలో రేవంత్ అబద్ధాల ప్రచారం

**కెసిఆర్ను తిట్టడమే పనిగా పెట్టుకున్న పెద్దమనిషి**

**మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు**

**సిద్దిపేట,ఆగస్ట్15:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్య దినోత్సవం రోజునా చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శిం చారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4:20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలు మాట్లాడారని మండిపడ్డారు. ఆయన తన ప్రసంగంలో ఉమ్మడి మెదక్ జిల్లా గురించి ఒక్క మాటా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని ఆరోపించారు. కామారెడ్డి జిల్లాకు మంచినీళ్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి బాగుపడాలని గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని నిప్పులు చెరిగారు. జహీరాబాద్లో బసవేశ్వర విగ్రహం ప్రారంభించి ఏడాది అయిందని, ఆ రోజు ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలయ్యాయా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లాలో ఈ మూడేళ్లలో ఒక్క రోడ్డు అయినా వేశారా? అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చారని అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ నేడు సంగారెడ్డిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని చెబుతున్నారని ఆగ్రహించారు. నిస్సిగ్గుగా అబద్దాలు మాట్లాడే రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే రేవంత్ నియామక పత్రాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎంపీ రాహుల్ గాంధీని పిలిచి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, మాట తప్పినందుకు నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గన్మెన్లు లేకుండా అశోక్ నగర్కు వస్తావా? అంటూ ఈ సందర్భంగా మాజీ మంత్రి సవాల్ విసిరారు. మరోవైపు, రెండేళ్ల ఫీజురీయింబర్స్మెంట్ ఎప్పుడూ ఇస్తారో చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వని ఆ కాలేజీలు, విద్యార్థుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని మండిపడ్డారు. అలాగే, రైతుల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు. కేసీఆర్ హయాంలో వరుసగా మూడేళ్లలో రూ.14,656 కోట్లు, రూ.14,721 కోట్లు, రూ.14,721 కోట్లు చొప్పున రైతు బంధు ఇచ్చారని పేర్కొన్నారు. 2024-25లో రేవంత్ ఇచ్చింది రూ.5,057 కోట్లేనని మండిపడ్డారు. 2025-26లో రూ.11 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన దానికంటే రూ.15 వేల కోట్లు రేవంత్ తక్కువ ఇచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి సొంత ఊరికి వెళ్లి రుణమాఫీ అయ్యిందో, లేదో అక్కడి రైతులను అడగాలన్నారు. ఆ రైతులు రుణమాఫీ అయ్యిందని చెబితే తాను రాజీనామా చేస్తానని, అవ్వలేదని చెబితే రేవంత్ రెడ్డి రాజీమానా చేస్తారా? అని సవాల్ చేశారు.

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

**అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం**

**సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం**

**యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు**

**జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి**

**దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం**

**ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు**

**ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే**



**న్యూఢిల్లీ :** భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోడీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూసగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు. అయితే స్వాతంత్య్ర వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

## దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

**ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం**

**ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం**

**సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేద్ర మోడీ**

**న్యూఢిల్లీ :** భారతదేశ 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాద కతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్ట్స్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6ఉ సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు. ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

**వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ**

**తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన**

**పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. దిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం 'జనగణమన'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు.

స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది' అని మోదీ అన్నారు.

## ఏపనిచేసినా కచ్చితత్వంతో చేయాలి

**యువతకు మంత్రి నిర్మలాసీతారామన్ హితవు**

**న్యూఢిల్లీ :** ఏ పని చేసినా ఎంతో జాగ్రత్తగా, కచ్చితత్వంతో చేయాలని యువ ఇంటర్న్‌లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద ఇంటర్న్‌షిప్ చేస్తున్న యువతతో న్యూఢిల్లీలో నిర్మలా సీతారామన్ తాజాగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పని పట్ల బాధ్యత, నిబద్ధత, కచ్చితత్వం ఎంత ముఖ్యమో వివరించారు. 'మీరు ఏ పని చేస్తున్నా జాగ్రత్తగా చేయండి. దాన్ని అత్యంత కచ్చితంగా చేయడానికి ప్రయత్నించండి. ఎందుకంటే మీరు చేసే చిన్న పొరపాటు తర్వాత మరొక వ్యక్తికి తీవ్ర పరిణామాలను కలిగించవచ్చు' అని నిర్మలా సీతారామన్ అన్నారు. ఒక వాహనంలోని చిన్న భాగాన్ని తయారు చేసే సమయంలో జరిగిన పొరపాటు చివరకు ఆ వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిపై ప్రభావం చూపవచ్చని అన్నారు. అది ప్రాణాలకు ప్రమాదం కలిగించవచ్చని, లేదా మరమ్మతుల కోసం వినియోగదారుడు నిరంతరం డబ్బు ఖర్చు చేయాల్సి రావచ్చని వివరించారు. బ్యాంకింగ్ రంగంలో పొరపాటున రూ.1,000 బదులు రూ.1 లక్ష బదిలీ చేస్తే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారని ఆమె ప్రశ్నించారు (ఎనిటబీబబిసా బీత్గి÷బె). అదేవిధంగా డిజిటల్ సమాచారాన్ని నిర్వహించే సమయంలో ఒక వ్యక్తి పేరు, ఖాతా లేదా ఇతర వివరాల్లో చిన్న తప్పు జరిగినా ఆ వ్యక్తికి కొత్త సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. బాధ్యతలు నిర్వర్తించే సమయంలో తమ పని వల్ల ప్రయోజనం పొందే వినియోగదారుడిని దృష్టిలో ఉంచుకోవాలని నిర్మలా సీతారామన్ సూచించారు.

## ఇండోనేషియాలో భారీ భూకంపం..

**47 మంది మృతి.. రిక్టర్ స్కేల్పై 7.7గా నమోదైన భూకంప తీవ్రత**

**విరిగిపడ్డ కొండచరియలు.. వందల ఇళ్లు ధ్వంసం.. పలువురికి గాయాలు 2000 మంది శిబిరాలకు తరలింపు**

**వరుస ప్రకంపనాల తర్వాత మరో భూకంపం**



**మౌమెరి(ఇండోనేషియా) :** ఇండోనేషియా తూర్పు ప్రాంతంలోని ఫ్లోరెస్ ద్వీపానికి సమీపంలో శనివారం ఉదయం 5.58 గంటలకు భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్పై దీని తీవ్రత 7.7గా నమోదైంది. భూకంపంతో కారణంగా 47 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అంచనా. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో 2 వేల మందిని తాత్కా లిక శిబిరాలకు తరలించారు. భూకంపంతో కొండ చరియలు విరిగి పడడం, రోడ్లు దెబ్బతినడంతో సహాయక చర్యలు ఆలస్యం అవుతున్నాయి. తీవ్రమైన భూప్రకంపనల కారణంగా అధికారులు తొలుత సునామీ హెచ్చరికలను జారీ చేశారు. తర్వాత ఉపసంహరించుకున్నారు. కాగా శనివారం సాయంత్రం 4.24 గంటలకు ఇండోనేషియాలోని ఉత్తర సుమత్రాలో రిక్టర్ స్కేల్పై 6.9 తీవ్రత గల మరో భూకంపం కూడా సంభవించింది. భూ ఉపరితలం నుంచి 172.5 కిలోమీ టర్ల లోతులో ఇది సంభవించడంతో పెద్దగా నష్టం వాటిల్ల లేదని ఇండోనేషియా అధికారులు చెప్పారు. కాగా ఇండోనేషియాలో 1992లో భూకంపం కారణంగా వచ్చిన సునామీతో ఫ్లోరెస్ ద్వీపం వద్ద 2,500 మంది చనిపోయారు

## టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

**ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య**

**ఉత్తరాఖండ్ :** చమోలి జిల్లా పిపల్‌కోటిలోని టీహెచ్‌డీసీ సొరంగంలో శుక్రవారం భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బిర్హి నది సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి పెద్దఎత్తున వరదనీరు, శిథిలాలు వచ్చి చేరాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారి కోసం సహాయక బృందాలను అధికారులు రంగంలోకి దించారు. భారీగా చేరిన నీరు, శిథిలాలను తొలగిస్తూ.. శనివారం మరో మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరోవైపు, శిథిలాల కింద చిక్కుకుపోయిన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. టీహెచ్‌డీసీ సొరంగంలోకి అకస్మాత్తుగా శిథిలాలు, నీరు చేరడంతో విధుల్లో ఉన్న కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా.. చిక్కుకుపోయిన కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వ జిల్లా యంత్రాంగంతో సహా అన్ని ఏజెన్సీలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరుగుతోందని సీఎం పుష్కర్ సింగ్ ధామి చెప్పారు. ఏ నిర్మాణ ప్రాజెక్టులోనైనా పని చేసే సిబ్బంది భద్రతే తొలి ప్రాధాన్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారమే ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కాగా, సొరంగం లోపల భారీగా చేరిన నీరు, బురద కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు.

## 370 ఆర్టికల్ రద్దుచేయకుంటే పివోకె కలిసేది

**కాశ్మీర్ సిఎం ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు**

**శ్రీనగర్ :** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితులపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదాను 2019లో రద్దు చేయకపోయి ఉంటే.. ఇప్పుడు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని ఆయన అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. పీవోకేలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రజలపై జరుగుతున్న పరిణామాలు తనను బాధిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడ పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడి జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. 1947లో పాకిస్థాన్ నుంచి వచ్చిన ఆక్రమణదారులను ఎదుర్కొన్న కశ్మీరీ ప్రజలను ఒమర్ అబ్దుల్లా గుర్తుచేసుకున్నారు. తన తాత, జమ్మూకశ్మీర్ తొలి ప్రధానమంత్రి షేక్ మహ్మద్ అబ్దుల్లా నేతృత్వంలోని కశ్మీరీలు ఆక్రమణదారులను ఎదుర్కొన్నారని చెప్పారు. భారత సైన్యం కశ్మీర్‌కు చేరుకోవడానికి ముందే స్థానిక ప్రజలు తమ ప్రాంతాన్ని రక్షించేందుకు పోరాడారని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదాను రద్దు చేయకపోయి ఉంటే.. ఈ రోజు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో పీవోకేకు సంబంధించిన స్థానాలను ఖాళీగా ఉంచామని, ఏదో ఒక రోజు అవి భర్తీ అవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ఇతర రాజ్యాంగపరమైన హామీలను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. కాగా, ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలను జమ్మూకశ్మీర్ బీజేపీ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ తప్పుపట్టారు. స్వాతంత్య్ర దినోత్సవం వంటి జాతీయ పర్వదినాన్ని రాజకీయ వ్యాఖ్యలకు ఉపయోగించడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు.

## పాక్ ఉగ్రవాద సంస్థతో లింకులు

**బెంగుళూరులో బెంగాల్ యువకుడి అరెస్ట్**

**బెంగళూరు :** బెంగళూరులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ 25 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర పరగణాల జిల్లాకు చెందిన అసఫూల్ మల్లిక్ బెంగళూరులోని జిగణి పారిశ్రామిక ప్రాంతంలోని ఓ సంస్థలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బొమ్మసంద్ర పారిశ్రామిక ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పద కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో మల్లిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ÷ాకిస్థాన్ సైన్యం ముస్లింలపై దాడులకు పాల్పడుతోందనే భావనతో తాను ఆగ్రహానికి గురైనట్లు మల్లిక్ చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో, ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో పాకిస్థాన్ వైఖరిపైనా అతడు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. భారతదేశంలో ముస్లింలకు ఇబ్బందులు ఎదురైతే ప్రతీకారం తీర్చుకోవాలని అతడిని ప్రేరేపించినట్లు కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ÷ిస్‌బుక్ ద్వారా అఎ÷-గానిస్థాన్‌కు చెందిన ఇమ్రాన్ హైదర్ అనే వ్యక్తితో మల్లిక్ పరిచయం పెంచుకున్నట్లు వెల్లడైంది. అఎ÷-గాన్‌కు చెందిన టీటీపీ ఉగ్రసంస్థ హ్యాండ్లర్లతో అతడు తరచూ సంప్రదింపులు జరుపుతున్నట్టు తేలింది. భారత్, పాకిస్థాన్‌లో దాడులకు వారు ప్రణాళికలు రచించినట్టు తెలుస్తోంది. అఎ÷-గాన్‌కు వెళ్లి ఉగ్రసంస్థలో చేరడానికి కూడా అతడు సిద్ధమవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

# పడిక్కల్ సూపర్ సెంచరీ




**గాలే టెస్టులో ముగిసిన తొలి రోజు ఆట**

**శ్రీలంకతో తొలి టెస్టులో సెంచరీతో మెరిసిన దేవదత్ పడిక్కల్**

**కండరాల నొప్పితో 77 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్**

**తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 288 పరుగులు చేసిన భారత్**

**వెలుతురు లేమి, వర్షం కారణంగా ముందుగానే ముగిసిన తొలి రోజు ఆట**




శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ (131 నాటౌట్), తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. అతనికి తోడు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) కూడా రాణించడంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేసే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. అయితే, జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, తీవ్రమైన కండరాల నొప్పితో కేఎల్ రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. గాయపడిన సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పడిక్కల్, లభించిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. క్రీజును చక్కగా ఉపయోగించుకుంటూ, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా బ్యాక్ ఫుట్‌పై ఆకట్టుకునే షాట్లు ఆడాడు. 134 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 2002లో సౌరవ్ గంగూలీ తర్వాత భారత జట్టులో మూడో స్థానంలో టెస్టు శతకం సాధించిన తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా పడిక్కల్ రికార్డు సృష్టించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో అనవసర షాట్‌కు యత్నించి మిడ్-ఆఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (27 నాటౌట్) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. పడిక్కల్‌తో కలిసి అజేయంగా 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయినా, బ్యాటర్ల జోరు తగ్గలేదు. అయితే, వెలుతురు మందగించడంతో అంపైర్లు తొలి రోజు ఆటను 17 ఓవర్లు ముందుగానే ముగించారు. పడిక్కల్ 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులు, పంత్ 36 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట 15 నిమిషాలు ముందుగా ప్రారంభం కానుండగా, భారత్ 500 పైచిలుకు స్కోరుపై కన్నేసింది.



## ఏపీలో మహిళల క్రికెట్‌కు కొత్త శకం

### మంగళగిరి వేదికగా ఉమెన్స్ ఏపీఎల్

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే దిశగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కీలక ముందడుగు వేసింది. పురుషుల కోసం విజయవంతంగా నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) తరహాలోనే తొలిసారిగా 'మహిళల ఏపీఎల్' నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరి వేదికగా జరగనుంది. ఈ లీగ్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడనున్నాయి. ఇప్పటికే జట్ల కోసం బిడ్డింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని కేశినేని చిన్ని తెలిపారు. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఒక జట్టును రూ.89 లక్షల అత్యధిక బిడ్‌తో దక్కించుకుంది. మిగిలిన జట్లను కూడా ఇతర సంస్థలు సొంతం చేసుకున్నాయి. ఈ ప్రకటన సందర్భంగా భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా పాల్గొంది. మహిళల కోసం ప్రత్యేకంగా లీగ్ నిర్వహించడంపై ఆమె హర్షం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో మహిళల క్రికెట్‌కు ఆదరణ బాగా పెరిగిందని, ఈ లీగ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారిణులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. జాతీయ జట్టుకు ఎంపికయ్యేందుకు ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడింది. ప్రస్తుతానికి ప్రతి జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడుతుందని, భవిష్యత్తులో ప్రేక్షకుల ఆదరణను బట్టి జట్ల సంఖ్యను పెంచే ఆలోచన ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ లీగ్‌లో ఆడేందుకు ఇప్పటికే దాదాపు 200 మంది క్రీడాకారిణులు తమ పేర్లను నమోదు చేసుకోవడం విశేషం.




## ప్రపంచ యూత్ ఆర్చరీ.. భారత్‌కు స్వర్ణం

అంతర్జాతీయ వేదికపై భారత యువ ఆర్చర్లు మరోసారి విజయకేతనం ఎగురవేశారు. దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో నిర్వహించిన 'ప్రపంచ ఆర్చరీ కేఏఏ యూత్ ఇన్విటేషనల్ 2024' టోర్నమెంట్‌లో భారత రికర్వ్ బాలికల జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆగస్టు 10 నుంచి 14 వరకు జరిగిన ఈ పోటీల్లో భారత అమ్మాయిలు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఫైనల్ పోరులో కొండపావులూరి యుక్తశ్రీ, కృషి కుమావత్, ప్రజల్ తోలియాలతో కూడిన భారత జట్టు, ఆతిథ్య దక్షిణ కొరియా జట్టును ఢీకొట్టింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు 5-3 తేడాతో కొరియాపై ఘనవిజయం సాధించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యుక్తశ్రీ కీలక పాత్ర పోషించడంతో రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ ఎ. రవినాయుడు, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షురాలు నందమూరి తేజస్విని, ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.వి.రమణ తదితరులు జట్టును అభినందించారు. ప్రస్తుతం భారత సీనియర్ విభాగంలో టాప్-8 ప్రాబబుల్ ఆర్చర్లలో ఒకరిగా కొనసాగుతున్న యుక్తశ్రీ ప్రతిభను వారు కొనియాడారు. ఆమె ఉన్నతికి కృషి చేసిన తల్లిదండ్రులను, కోచ్‌లను ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# భారత క్రికెట్‌లో ముగిసిన ఒక స్వర్ణయుగం..

## ధోనీ వీడ్కోలుకు ఆరేళ్లు!

భారత క్రికెట్ చరిత్రలో అదొక మరపురాని రోజు. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో మునిగి తేలుతున్న వేళ, ఒక శకం ముగిసింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలకు.. భారత క్రికెట్‌ను శాసించిన, అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకడైన మహేంద్ర సింగ్ ధోనీ తన 15 ఏళ్ల అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఎలాంటి మీడియా సమావేశం లేదు, సుదీర్ఘ ప్రసంగాలు లేవు, ఆర్భాటాలు అసలే లేవు. తనకు మాత్రమే సాధ్యమైన రీతిలో అత్యంత నిశ్శబ్దంగా ధోనీ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో, తన క్రికెట్ ప్రయాణంలోని మధురమైన చిత్రాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నాడు. ఆ వీడియో నేపథ్యంలోని 'మై పల్ దో పల్ కా షాయర్ హూన్' అనే ముకేశ్ పాట, అతని వీడ్కోలు భావనకు అద్దం పట్టింది. "ఇన్నాళ్లు మీరు చూపిన ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. ఈ రోజు రాత్రి 7:29 గంటల నుంచి నన్ను రిటైర్ అయిన వ్యక్తిగా పరిగణించండి" అని క్లుప్తంగా రాసుకొచ్చాడు. అంతే.. ఒక్క పోస్ట్‌తో భారత క్రికెట్‌లో ఒక స్వర్ణయుగం ముగిసిపోయింది. నాయకత్వానికి కొత్త అర్థం చెప్పిన, ఒత్తిడిలో మ్యాచ్‌లను ముగించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్న ఒక గొప్ప యోధుడు మైదానం నుంచి అలా నిష్క్రమించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ధోనీ, ఆ తర్వాత చరిత్ర సృష్టించాడు. మూడు ప్రధాన ఐసీసీ ట్రోఫీలు (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ) గెలిచిన ప్రపంచంలోని ఏకైక కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. 2007లో తొలి టీ20 ప్రపంచకప్‌ను యువ జట్టుతో గెలిచి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత 2011లో వాంఖడే స్టేడియంలో సిక్సర్‌తో వన్డే ప్రపంచకప్‌ను అందించి భారతీయుల 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపుతో అతని కెప్టెన్సీ ప్రస్థానం పరిపూర్ణమైంది. ఆటగాడిగానూ ధోనీ గణాంకాలు అద్భుతం. 350 వన్డేల్లో 10,773 పరుగులు, 90 టెస్టుల్లో 4,876 పరుగులు చేశాడు. 98 టీ20 మ్యాచ్‌లలోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వికెట్ల వెనుక అతడి చురుకుదనానికి 829 అంతర్జాతీయ డిస్మిసల్స్ నిదర్శనం. ప్రపంచంలోని గొప్ప వికెట్ కీపర్-బ్యాటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఆడిన మ్యాచే మహీ చివరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, క్రికెట్‌కు మాత్రం దూరం కాలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు నాయకుడిగా కొనసాగుతూ, ఆ జట్టుకు ఐదుసార్లు టైటిల్స్ అందించాడు. 2023లో కూడా సీఎస్‌కేను ఛాంపియన్‌గా నిలబెట్టడం ధోనీ నాయకత్వ పటిమకు నిదర్శనం. ధోనీ వారసత్వం కేవలం ట్రోఫీలు, పరుగులకు మాత్రమే పరిమితం కాదు. ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉంటూ నిర్ణయాలు తీసుకోవడం అతని ప్రత్యేకత. అందుకే అభిమానులు ముద్దుగా 'కెప్టెన్ కూల్' అని పిలుచుకుంటారు. ఆరేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలు అయిందంటే కోట్లాది మంది అభిమానుల గుండెల్లో మహీ జ్ఞాపకాలు మెదులుతూనే ఉంటాయి.



# శ్రీయా.. అప్పటి క్రేజ్ ఇంకా అలాగే..

ఒకప్పుడు తెలుగు సినిమాలతో బిజీగా కనిపించిన శ్రీయా ఇప్పుడు మాత్రం ఫ్యామిలీ లైఫ్ తో బిజీగా మారింది. రీసెంట్ గా అమ్మడు సెయింట్ పీటర్స్‌బర్గ్ వీధుల్లో హైలెట్ అయ్యింది. భర్త ఆండ్రీ కొశ్చీవ్, కూతురు రాధాతో కలిసి తీసుకున్న ఫోటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఇది సినిమా ఫోటోషూట్ కూడా కాదు. ఫ్యామిలీ ట్రిప్‌లో తీసుకున్న ఫోటోలే. అయినా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడానికి కారణం ఆమె లుక్ అనే చెప్పాలి. శ్రీయా పేరు తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఇష్టం తర్వాత సంతోషం, నువ్వే నువ్వే, ఠాగూర్, అర్జున్, ఛత్రపతి లాంటి సినిమాలతో 2000లలో టాప్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. చిరంజీవి, మహేష్ బాబు, ప్రభాస్ లాంటి హీరోల సరసన నటించింది. తమిళంలో రజనీకాంత్‌తో చేసిన శివాజీ ఆమె క్రేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆ టైంలో పాటల్లో శ్రీయా కనిపిస్తే చాలు అనే రేంజ్‌లో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉండేది. ఇరవై ఏళ్ల తర్వాత కూడా శ్రీయా పూర్తిగా తెరకు దూరం కాలేదు. హీరోయిన్ పాత్రలే అని పట్టుకుని కూర్చోకుండా వయసుకు తగ్గ క్యారెక్టర్లకు మారిపోయింది. ఆర్ఆర్ఆర్‌లో చిన్న పాత్రలో కనిపించిన ఆమె, హిందీలో దృశ్యం 2తో మరోసారి పెద్ద విజయాన్ని అందుకుంది. గత ఏడాది తేజ సజ్జా మిరాయిలో అంబిక పాత్రలో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది.






## విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

## సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.



# కట్టలు తెంచుకున్న రోమాన్స్.. హుషారు పిట్టలు !

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణెళిశన్)ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చేశారు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుంది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు చాటుమాటుగా సాగిన రవి – చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్ధం ఆసక్తికరంగా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి – చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం..



తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342